క్లుప్తంగా

ఫుడ్ అండ్ సైన్స్ కళాశాల విద్యార్థినుల ప్రతిభ


చింత శ్రీలేఖ


చైతన్య

పులివెందుల టౌన్ : పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని చిన్నరంగాపురం సమీపంలో ఉన్న ఫుడ్ అండ్ సైన్స్ టెక్నాలజీ కళాశాల విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ కనపరిచారు. 2023–24లో కళాశాలలో చదివిన విద్యార్థినులు పలు పోటీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనపరిచారు. జాతీయ, అంతర్జాతీయ ప్రతిష్టాత్మక యూనివర్సిటీలలో ప్రవేశం పొందారని పులివెందుల, ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయానికి మంచి పేరు తీసుకొచ్చారని కళాశాల అసోసియేట్ డీన్ ఎం.ఎస్.బేగ్ తెలిపారు. 4వ సంవత్సరం విద్యార్థిని చింత శ్రీలేఖ పీజీసెట్ ఫుడ్ టెక్నాలజీ విభాగంలో రాష్ట్రంలోనే ప్రథమ ర్యాంకు సాధించడం తమ కళాశాలకు గర్వకారణమన్నారు. మరొక విద్యార్థిని చైతన్య కూడా విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు జీఆర్ఈ టోఫెల్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనపరచి అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ జార్జియాలో ఎంఎస్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో చదివేందుకు సీటు పొందిందని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులను, విద్యార్థినులను ఆయన అభినందించారు.

నాణ్యమైన భోజనం అందించాలి


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఉప విద్యాశాఖాధికారి కృష్ణప్ప

వీరపునాయునిపల్లె : పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ప్రొద్దుటూరు డివిజన్ ఉప విద్యాశాఖాధికారి కృష్ణప్ప పేర్కొన్నారు. సోమవారం మండల పరిధి పాయసంపల్లె గ్రామంలోని కందుల మంగమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. పిల్లలతోపాటు ఆయన అక్కడే భోజనం చేశారు. వంట చేయు ప్రాంతాన్ని రోజూ శుభ్రంగా ఉంచుకోవాలని, అంతే కాకుండా వంట చేసే సమయంలో చాలా జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు. మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. తాగునీరు కలుషితం కాకుండా ఉండేందుకు నిరంతరం ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు.

ఘనంగా వైద్యుల దినోత్సవం


కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న వైద్యులు, సిబ్బంది

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్లలో జాతీయ వైద్యుల దినోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. పీహెచ్‌సీలో వైద్యాధికారులు, డాక్టర్లు శ్రీనాథ్‌రెడ్డి, జ్యోత్స్న, ప్రియాంక్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది వైద్యాధికారులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

హాకీ పోటీలను విజయవంతం చేయండి


ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న హాకీ కోచ్‌లు

పులివెందుల రూరల్ : పులివెందులలో ఈ నెల 10 నుంచి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సౌత్ ఇండియన్ జూనియర్ బాలబాలికల హాకీ చాంపియన్ షిప్ పోటీలను విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆర్అండ్‌బీ అతిథి గృహంలో హాకీకి సంబంధించిన కోచ్‌లు, ట్రెజరర్లు ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డిని సన్మానించారు. ఈ సందర్భంగా హాకీ క్రీడలను విజయవంతంగా జరిపించేందుకు తమవంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. వారం రోజుల పాటు నిర్వహించే హాకీ క్రీడా పోటీలకు వివిధ రాష్ట్రాల నుంచి క్రీడాకారులు హాజరు అవుతారని, వారికి అన్ని సదుపాయాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, హాకీ కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌గా ప్రకాష్‌రావు

పోరుమామిళ్ల: పోరుమామిళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా సోమవారం సగిలి ప్రకాష్ రావు బాధ్యతలు చేపట్టారు. ఆయన ఆయన సోమవారం ఎఫ్ఏసీగా బాధ్యతలు తీసుకోవడంపై సహచర అధ్యాపకులు, పట్టణ ఉపాధ్యాయులు, పలువురు ఆయనకు అభినందనలు తెలిపారు.

ఖరీఫ్ సాగుకు సన్నద్ధం


ఎద్దులతో సేద్యం చేస్తున్న రైతు


పొలం దున్నుతున్న ట్రాక్టర్

- ప్రధాన పంటగా పత్తి సాగు
- కనుమరుగవుతున్న వేరుశనగ పంట
- ప్రత్యామ్నాయ పంటలపై రైతులు మొగ్గు

వేముల : ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఇందుకోసం పొలాలను దుక్కులు దున్ని సాగుకు సిద్ధం చేస్తున్నారు. ముంగారు వర్షాలు లేక పొలాలను దుక్కులు చేసేందుకు వీలు లేకుండా పోయింది. అంతేకాక సేద్యాలకు అదునులో వర్షాలు లేవు. రుతుపవనాల ప్రభావంతో వర్షాలు పడుతుండడంతో భూములు పదునుల్లు అయ్యాయి. దీంతో ట్రాక్టర్లు, ఎద్దుల సాయంతో పొలాల్లో సేద్యాలు ముమ్మరంగా చేస్తున్నారు. ఇప్పటికే ఇదే అదున్లో పంటలు సాగు చేయాల్సిన పరిస్థితి. అయితే సేద్యాలకు ముందుగా వర్షాలు పడకపోవడంతో భూములు బీడులుగా ఉండిపోయాయి. ఇప్పుడు పదును వర్షాలతో పొలాల్లో రైతులు సేద్యాలు చేపడుతున్నారు.

ఖరీఫ్‌లో ప్రధాన పంటగా పత్తి

ఖరీఫ్‌లో ప్రధాన పంటగా పత్తి పంట సాగవుతుంది. గత ఐదు, ఆరు సంవత్సరాలుగా రైతులు ఖరీఫ్‌లో పత్తి పంట వైపు మొగ్గు చూపుతున్నారు. పంటకు తక్కువ పెట్టుబడులు కావడంతోపాటు దిగుబడులు ఆశాజనకంగా ఉండడం రైతులకు కలిసి వస్తోంది. అంతేకాక మార్కెట్ ధరలు కూడా నిలకడగా ఉండడం, సాగులో ఆదాయం ఉండడంతో రైతులు ఆ దిశగా సాగుపై ఆసక్తి చూపుతున్నారు. పంట సాగు చేసిన నాలుగు నెలలకే దిగుబడులు అందుతున్నాయి. అయితే పంటకు తెగులు సోకకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు కలుపు మొక్కలు తీసేందుకు అదనంగా ఖర్చులు అవుతున్నాయని రైతులు అంటున్నారు. చీడపీడల నుంచి పంటను కాపాడుకునేందుకు ముందు జాగ్రత్తలు తీసుకోవడంతో ఆశించిన స్థాయిలో దిగుబడులు ఉండడంతో రైతులకు సాగు ఊరటనిస్తోంది.

కనుమరుగవుతున్న వేరుశనగ పంట

ఖరీఫ్‌లో ఒకప్పుడు ప్రధాన పంటగా వేరుశనగ సాగయ్యేది. అయితే కాలానుగుణంగా ఖరీఫ్‌లో వేరుశనగ పంట కనుమరుగైంది. నియోజకవర్గ వ్యాప్తంగా వేల ఎకరాలలో వేరుశనగ పంటను రైతులు సాగు చేసేవారు. అయితే పంట సాగులో పెట్టుబడులు పెరిగిపోయాయి. ఆశించిన మేర దిగుబడులు అందడం లేదు. సాగులో ఎకరాకు రూ.30 వేలు పెట్టుబడులు అవుతున్నాయని అందువల్ల వేరుశనగ పంట వైపు ఆసక్తి చూపడం లేదని రైతులు అంటున్నారు. కొంత మంది రైతులు సాగులో పెట్టుబడులు అయినప్పటికీ పంట సాగు చేసి దిగుబడులు లేక నష్టాలను చవిచూశారు.

ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు

ప్రతి ఏడాది ఒకేరకమైన పంటను సాగుచేయడం వల్ల దిగుబడులు తగ్గిపోయి నష్టపోయి ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపుతున్నామని రైతులు అంటున్నారు. ఖరీఫ్‌లో సకాల వర్షాలు కురిస్తే భూములు పదునులైతే ఎక్కువ మంది రైతులు పెసర, మినుము తదితర పంటల వైపు దృష్టి సారిస్తున్నారు. పంట కాలం 90 రోజులు కావడంతో రైతులు ఆ దిశగా సాగుకు సిద్ధమవుతున్నారు. పంట కాలం పూర్తయి దిగుబడులు అందిన తర్వాత రబీలో శనగ, ధనియాల పంటలను సాగు చేయవచ్చన్న ఉద్దేశంతో రైతులు ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకుంటున్నారు. ఒక పంటలో నష్టపోయినా మరో పంటలో ఆదాయం ఉంటుందనే ఉద్దేశంతో రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గుచూపుతున్నారు.

పెట్టుబడులు తక్కువ కావడంతోనే..



ఖరీఫ్‌లో ఎక్కువ శాతం మంది రైతులు పత్తి పంట వైపు మొగ్గుచూపుతున్నారు. సాగులో పెట్టుబడులు తక్కువ కావడంతోనే సాగుకు ఆసక్తి కనపరుస్తున్నారు. వేరుశనగ పంట పెట్టుబడులతో కూడుకున్నది కావడంతో రైతులు సాగుకు స్వస్తి పలుకుతున్నారు. ఎక్కువ ఏ పంటలో ఆదాయం ఉంటుందో ఆ పంటలనే రైతులు సాగు చేయడం మొదలుపెడుతున్నారు. తక్కువ పెట్టుబడులతో ఎక్కువ దిగుబడులు ఇచ్చే పంటలపై ఆసక్తి కనపరుస్తున్నారు.

– చెన్నారెడ్డి, ఏఓ, వేముల

రాంగోపాల్‌రెడ్డి వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలి

సింహాద్రిపురం మండల ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి



పులివెందుల : తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని సింహాద్రిపురం మండల ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో పులివెందులలో సెంటు భూమికి కూడా నీరివ్వలేదని రాంగోపాల్‌రెడ్డి విమర్శించడం శోచనీయమన్నారు. గడచిన ఐదేళ్ల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు పైగా నీరు అందించడం జరిగిందన్నారు. గండికోట, పైడిపాలెం, చిత్రావతి రిజర్వాయర్‌లలో పూర్తి సామర్థ్యం నీటిని ఉంచిన ఘనత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. రాంగోపాల్‌రెడ్డికి ఈ విషయాలు తెలియకుంటే అధికారుల ద్వారా రికార్డులను తెప్పించుకొని పరిశీలించుకోవాలన్నారు. చిత్రావతి రిజర్వాయర్‌లో గతంలో 4 టీఎంసీల కన్నా నీరు ఉండేవి కాదని, ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్, ఎంపీగా వైఎస్ అవినాష్‌రెడ్డిలు రూ.240 కోట్లు ఆర్అండ్‌ఆర్ ప్యాకేజీ చెల్లించి 10 టీఎంసీల నీరు చిత్రావతిలో నిల్వ చేసి తద్వారా 1.10 లక్షల ఆయకట్టుకు నీరు ఇచ్చిన విషయం మరిచిపోయావా? అని ప్రశ్నించారు. దొండ్లవాగు లిఫ్ట్ స్కీమ్, సీబీఆర్ కాలువ డీప్‌కట్‌లో కట్టడాలు నిర్మించడం, ఎగువపల్లి వరకు ఉన్న పైపులైను కోమన్నూతల వరకు పొడిగించడం, అలాగే మురారిచింతల వరకు పైపులైను, లింగాల చెరువు నుంచి వనంబావి కుంటకు ఎత్తిపోతల పథకం, లింగాల కుడికాలువకు ఓటి స్లయిస్, పీబీసీ ప్రధాన కాలువ మీద గురిజాల నుంచి అంకేవానిపల్లె గేట్లు వరకు ఇన్‌స్పెక్షన్ ట్రాక్ నీయడం, బలపనూరు డిస్ట్రిబ్యూటరీ కాలువల పూడిక తీయడం, అంకాలమ్మగూడూరు చెరువుకు మెరువ ఏర్పాటు, జీఎన్ఎస్ఎస్–హెచ్ఎన్ఎస్ఎస్ అనుసంధాన ఎత్తిపోతల పథకం, జీఎన్ఎస్ఎస్–హెచ్ఎన్ఎస్ఎస్ ద్వారా చక్రాయపేట మండలానికి సాగునీరు, కాలేటి వాగు సామర్థ్యాన్ని 0.2 టీఎంసీ నుంచి 1.2 టీఎంసీలకు పెంచడం, ఎర్రబల్లి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా యూసీఐఎల్ ప్రభావిత గ్రామాలకు తాగునీరు అందించడం, అలవలపాడు లిఫ్ట ఇరిగేషన్ ద్వారా పీబీసీ కెనాల్ చివరి ఆయకట్టుకు నీరందించిన ఘనత ఇలా నియోజకవర్గంలోని అన్ని మండలాలకు ఇరిగేషన్‌కు ప్రాధాన్యత ఇచ్చి నీరందించిన ఘనత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీదేనన్నారు. రాంగోపాల్‌రెడ్డి వాస్తవాలను పరిశీలించి మాట్లాడితే బాగుంటుందని ఆయన హితవు పలికారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు


చట్టాలపై అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ వినోద్‌కుమార్

పులివెందుల : శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిన అంశాలు, కొత్త చట్టాలపై పోలీసు సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం స్థానిక అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సమావేశాన్ని నిర్వహించినట్లు డీఎస్పీ వినోద్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై 1 నుంచి ఐపీసీ స్థానంలో భారతీయ న్యాయ సంహిత, సీఆర్పీ స్థానంలో భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ స్థానంలో భారతీయ సాక్ష్యా అధినియంలు అమలులోకి వచ్చాయన్నారు. మారిన కొత్తచట్టాల మేరకు మెరుగైన విధానాలలో దర్యాప్తు జరపడం, కొన్ని రకాల నేరాలకు ప్రత్యేక సెక్షన్లు తీసుకురావడం, దర్యాప్తు కాలానికి నిర్దేశిత కాలపరిమితి విధించడం, పోలీసు కస్టడీ కాలపరిమితి పొడిగించడం వంటి మార్పులు తీసుకొచ్చామన్నారు. ముఖ్యంగా శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ఘటనలు ఉత్పన్నమైనప్పుడు పరిస్థితులను తమ ఆధీనంలో తెచ్చుకునేందుకు మెజిస్టీరియల్‌కు ఉన్న అధికారాలు మారిన చట్టం మేరకు పోలీసు ఉన్నతాధికారులు స్వతంత్రంగా నిర్ణయం తీసుకునే అధికారాలు కల్పించినట్లు తెలిపారు. పాత చట్టాలకు కొత్త చట్టాలకు మధ్య ఉన్న వ్యత్యాసాలను పోలీసు సిబ్బందికి ఆయన క్షుణ్ణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో సీఐ బాలమద్దిలేటి, ఎస్సైలు, ఏఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

కలుషిత నీరు తాగేదెలా?



అధికారులను నిలదీస్తున్న మహిళలు, కుళాయిల ద్వారా వచ్చిన కలుషిత నీటిని చూపిస్తున్న మహిళలు

- పైపులైన్ లీకేజీలతో కుళాయిలకు కలుషిత నీరు
- ఆందోళన చెందుతున్న ప్రజలు
- మరమ్మతులు చేయిస్తామని అధికారులు హామీ

ఎర్రగుంట్ల : పైపులైన్ ద్వారా కుళాయిలకు కలుషిత నీరు వస్తుంటే తాగేదెలా అని మహిళలు ప్రశ్నించారు. ఎర్రగుంట్ల మున్సిపాలిటీ పరిధి 12వ వార్డులోని శ్రీ ఏరువాక గంగమ్మ తల్లి ఆలయం పక్క వీధిలో సోమవారం పైపులైన్ నుంచి కలుషిత నీరు రావడంతో మహిళలు ఆందోళన చెందారు. ఈ విషయం వెంటనే మున్సిపల్ అధికారులకు తెలిపారు. మున్సిపల్ ఏఈ సురేష్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ మధుకుమార్ వచ్చి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ కాలనీ మహిళలు మాట్లాడుతూ పైపులైన్ ఎక్కడ దెబ్బతిందో తెలియదు కానీ, కుళాయిల నుంచి కలుషిత నీరు వచ్చిందన్నారు. ఈ నీరు తాగినా, స్నానాలకు ఉపయోగించినా రోగులు వచ్చే ప్రమాదం ఉందని వారు వాపోయారు. ఈ విషయంపై అధికారులు మాట్లాడుతూ ఇటీవల వర్షాలు పడటంతో వరద నీరు పైపులైన్ లీకేజీల ద్వారా వచ్చి ఉండవచ్చన్నారు. వెంటనే లీకేజీలు ఎక్కడ ఉన్నాయో పరిశీలించి మరమ్మతులు చేయిస్తామన్నారు. అప్పటి వరకు ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తామన్నారు. శాంతినగర్, ఈ కాలనీలలో పైపులైన్ ఏర్పాటుకు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి కౌన్సిల్ సమావేశంలో చర్చించారన్నారు. వెంటనే నామినేషన్ పద్ధతి కింద పైపులైన్ కొత్తది ఏర్పాటు చేయిస్తామని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని ఏఈ తెలిపారు.

డయేరియాపై అప్రమత్తత అవసరం


చింతకొమ్మదిన్నె : పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైద్య సిబ్బంది


జమ్మలమడుగు : సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శాంతికళ

జమ్మలమడుగు : డయేరియాపై అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శాంతికళ పేర్కొన్నారు. సోమవారం స్థానిక సాయిబాబా దేవాలయం వద్ద ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్‌లో రెండు అర్బన్‌హెల్త్ సెంటర్ మెడికల్ అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డయేరియా సోకిన వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వాంతులు, విరేచనాలు ఎక్కువగా వచ్చినప్పుడు వ్యక్తిగత శుభ్రత పాటించే విధంగా చేయాలన్నారు. ఈగలు ముసిరిన ఆహార పదార్థాలను ముట్టుకోకుండా చేయాలని సూచించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లను డయేరియా వ్యాధి సోకిన వారికి రోజూ తాపించాలని సూచించారు. ఏఎన్ఎంలతోపాటు ఆశా వర్కర్లు క్షేత్రస్థాయిలో పర్యటించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకుందాం

ఇంటితోపాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే డయేరియా వ్యాధి ప్రబలకుండా ఉంటుందని ఎమ్మెల్యే సి.ఆదినారాయణరెడ్డి పేర్కొన్నారు. అర్బన్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శాంతికళ, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముద్దనూరు : అతిసార వ్యాధిని అరికట్టడానికి ప్రభుత్వం చేపడుతున్న స్టాప్ డయేరియా కార్యక్రమంపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ కరిష్మా పేర్కొన్నారు. ఆమె సిబ్బందితో కలిసి అతిసార వ్యాధి వ్యాప్తి, దాని నివారణపై ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

జాగ్రత్తలను పాటించాలి

చింతకొమ్మదిన్నె : మండలంలోని ప్రజలందరూ ఆరోగ్య జాగ్రత్తలను పాటించాలని ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ రాఘవేంద్ర తెలిపారు. సోమవారం చింతకొమ్మదిన్నెలో వాంతులు, విరేచనాలపై ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించడంలో భాగంగా పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాల ప్రభావం కావడంతో మారిన వాతావరణ పరిస్థితులు, ఈగలు, దోమల పెరుగుదలకు దోహదం చేస్తాయన్నారు. కనుక ప్రజలు వ్యాధుల బారినపడే అవకాశం ఉందని అన్నారు. ముఖ్యంగా వ్యాధి నిరోధకశక్తి పిల్లలలోను, వృద్ధులలోను తక్కువగా ఉంటుంది కనుక వారు జాగ్రత్తగా ఉండాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు జనార్దన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వంతెన పనుల పరిశీలన

కొండాపురం : మండల పరిధిలోని పెన్నానదిపై ఆగిన నిర్మాణ పనులను స్థానిక ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి పరిశీలించారు. సోమవారం పాత కొండాపురంలో పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం పెన్నా నదిపైన ఇప్పటి వరకు ఎంత నిర్మాణ పనులు జరిగాయని అధికారులు, గుత్తేదారునితో అడిగి తెలుసుకన్నారు. వంతెన సమీపంలో నష్టపోయిన భూమి రైతులతో మాట్లాడారు. పరిహారం విషయమై జిల్లా అధికారులతో మాట్లాడి త్వరలోనే నిర్ణయానికి వస్తామని ఆయన తెలియజేశారు. అనంతరం గ్రామాల్లో నీటి సరఫరా లేకుండా చూడాలని ఆర్‌డబ్ల్యూస్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాసులు, ఎంపీడీఓ నాగేంద్రప్రసాద్, మండల టీడీపీ కన్వీనర్ గండ్లూరు నాగేశ్వర్ రెడ్డి, పి.వి.నరసింహారెడ్డి, శంకర్‌రెడ్డి, గోషెట్టి బాబు, తదితరులు పాల్గొన్నారు.

ముద్దనూరు : స్థానిక ఎస్టీ గిరి కాలనీలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఆయన మండలంలోని కమ్మవారిపల్లె గ్రామంలో నేషనల్ హైవే కోసం చేపట్టిన రహదారి విస్తరణ పనులను పరిశీలించారు. ఆర్డీవో శ్రీనివాస్‌తో రహదారి విస్తరణ పనులపై ఆరా తీశారు.

హుండీ ఆదాయం లెక్కింపు


హుండీ లెక్కింపులో ఆలయ కమిటీ నిర్వాహకులు

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణం శాంతినగర్ కాలనీలోని శ్రీ ఏరువాక గంగమ్మతల్లి ఆలయ హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. రెండు నెలలకు సంబంధించిన హుండీ ఆదాయాన్ని ఆలయ వార్షికోత్సవం సందర్భంగా లెక్కించారు. భక్తులు అమ్మవారికి కానుకల రూపంలో హుండీలో సమర్పించారు. సుమారు రూ.66,160 నగదు ఉందని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

ఆఫీసుల రహదారిలో అపరిశుభ్రత


నడి రోడ్డు మీదే నిలిచిన వర్షపు నీరు

ముద్దనూరు : మండల కేంద్రమైన ముద్దనూరులో ప్రభుత్వ కార్యాలయాల రహదారి అపరిశుభ్రంగా మారింది. స్థానిక పాతబస్టాండు కూడలి నుంచి మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం వరకు అపరిశుభ్రత చోటుచేసుకుంది. స్థానిక మార్కెట్ ఎదురుగా మురుగునీటి నిల్వ, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో వర్షపునీటితోపాటు, డ్రైనేజీ లీకేజీ నీటి నిల్వ, మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం చుట్టూ మురుగునీటి నిల్వతో దుర్వాసన వస్తోంది. నిత్యం అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే అధికారులతోపాటు ప్రజలు ఈ అపరిశుభ్రతతో ఇబ్బందులకు గురవుతున్నారు. సంబంధిత అధికారుల స్పందించి అపరిశుభ్రత లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు శివాలయం గదుల వేలం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరస్వామి (శివాలయం) ఆలయానికి సంబంధించిన 15 షాప్ గదులను మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి దేవాదాయశాఖ ఏసీ శంకర్‌బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వారు పాల్గొనవచ్చునని వారు పేర్కొన్నారు.

జోరుగా పింఛన్ల పంపిణీ


జమ్మలమడుగులో పెన్షన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి


కమలాపురంలో దివ్యాంగుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చైతన్యరెడ్డి


సింహాద్రిపురంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి, లతారెడ్డి

సాక్షి నెట్‌వర్క్ : పులివెందుల క్లస్టర్ పరిధిలోని పులివెందుల, జమ్మలమడుగు, కమలాపురం నియోజకవర్గాల్లో సోమవారం పింఛన్లు జోరుగా పంపిణీ చేశారు. ఆ ప్రాంతాల్లోని లబ్ధిదారులకు ప్రజాప్రతినిధులు, అధికారులు, టీడీపీ, బీజేపీ శ్రేణులు పింఛన్లు పంపిణీ చేశారు. జమ్మలమడుగు నియోజకవర్గంలోని జమ్మలమడుగు పట్టణం, ముద్దనూరు, కొండాపురంలో ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి పింఛన్ల పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ, కమిషనర్ ప్రమోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. జమ్మలమడుగు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి భూపేష్‌రెడ్డి ఎర్రగుంట్ల పట్టణంలో పింఛన్‌లు పంపిణీ చేశారు.

- కమలాపురం నియోజకవర్గంలోని వీరపునాయునిపల్లె మండలం పాయసంపల్లె గ్రామంలో ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి పింఛన్ల పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. అలాగే ఆయన కమలాపురం పట్టణంలోని అరవింద్ నగర్, అప్పాయపల్లె, వల్లూరు మండల పరిధిలోని పెద్దపుత్త గ్రామం, పెండ్లిమర్రి మండలంలోని వెల్లటూరు గ్రామం, చెన్నూరులో పింఛన్లు పంపిణీ చేశారు.
- పులివెందుల నియోజకవర్గం సింహాద్రిపురంలోని ఎస్సీ కాలనీలో మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి, లతారెడ్డి దంపతులు పింఛన్ పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. లింగాలలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

5న విద్యుత్ అదాలత్

పులివెందుల రూరల్ : విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 5న ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాసులు తెలిపారు. పులివెందుల డివిజన్ పరిధిలోని రూరల్, టౌన్, వేంపల్లె సబ్ డివిజన్‌కు సంబంధించి ప్రత్యేక అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. 5వ తేదీ శుక్రవారం ఉదయం 11.30 గంటల నుంచి 1గంట వరకు అంబకపల్లె రోడ్డులోని మినిసెక్రటేరియట్‌లో అదాలత్ నిర్వహిస్తామన్నారు. వినియోగదారులు తమ సమస్యలను రాత పూర్వకంగా ఫిర్యాదు ద్వారా తెలియజేసి పరిష్కరించుకోవాలన్నారు.

పింఛన్లు అంటే గుర్తుకు వచ్చేది వైఎస్ కుటుంబమే

మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ చిన్నప్ప



పులివెందుల : రాష్ట్రంలో అవ్వతాతలకు కానీ వికలాంగులకు కానీ పింఛన్లు అంటే గుర్తుకు వచ్చేది వైఎస్ కుటుంబమేనని మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చిన్నప్ప పేర్కొన్నారు. సోమవారం ఆయన ఒక ప్రకటనలో తెలుపుతూ గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పింఛన్లు పెంచడం జరిగిందన్నారు. ఆయన తరువాత వైఎస్ జగన్ హయాంలో కుల, మత, ప్రాంత, పార్టీలకు అతీతంగా రూ.3 వేలు పింఛన్ అందించడం జరిగిందన్నారు. 2019లో ఎన్నికలప్పుడు మాత్రం ఒక నెల ముందు చంద్రబాబు రూ.2 వేలు పింఛన్ ఇవ్వడం జరిగిందన్నారు. ఇప్పుడు తెలుగుదేశం పార్టీ నాయకులు భారతదేశంలో ఎక్కడా లేని విధంగా పింఛన్లు పంపిణీ చేస్తున్నామని చెప్పాలనుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. పార్టీలు చూడకుండా పింఛన్లు ఇచ్చిన ఘనత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. కానీ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చి మొదటి నెలలోనే గ్రామాల్లో కొంత మంది పింఛన్లు తొలగించడం జరిగిందన్నారు. తమ పార్టీ ఎన్నికల్లో ఓటమి మాత్రమే చెందిందని, కానీ ప్రజలు టీడీపీ పార్టీ చేతిలో మోసపోయారన్నారు. పులివెందుల అభివృద్ధి గురించి మాట్లాడుతున్న టీడీపీ నాయకులు వారి పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఏనాడైనా పులివెందులకు నిధులు తెచ్చి అభివృద్ధి చేశారా? అని ప్రశ్నించారు. పులివెందుల టీడీపీ నాయకులు విమర్శలు మానుకొని ప్రజలకు మేలు చేయడంపై దృష్టి పెడితే బాగుంటుందని ఆయన పేర్కొన్నారు.

కార్మిక సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న భవన నిర్మాణ కార్మిక నాయకుడు రాధాక్రిష్ణ

ఎర్రగుంట్ల : భవన నిర్మాణ కార్మికులకు అండగా ఉండే కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ రాధాక్రిష్ణ అన్నారు. సోమవారం ఎర్రగుంట్ల పట్టణంలోని భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయంలో కార్మికులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల పట్ల గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. కరోనా సమయంలో ఉపాధి లేక కార్మికులు చాలా ఇబ్బందులు పడ్డారన్నారు. నూతన ప్రభుత్వం పట్ల కార్మికులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని, ఉచితంగా ఇసుకను అందించి కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. సబ్సిడీలతోపాటు పనిముట్లు, రుణాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు ఆంజనేయులు, చిరంజీవి, శ్రీను, రంగా రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

లింగాల : లింగాల ప్రభుత్వ పారిశ్రామిక సంస్థలో 2024–25కు సంబంధించి రెండవ విడత ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ రఘురామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24న సాయంత్రం 5గంటల లోపు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు. 10వ తరగతి మార్కు లిస్టు, ఆధార్‌కార్డు, కులధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు, మొబైల్ నెంబరు, ఇమెయిల్ ఐడీని పొందుపరచాలన్నారు. దరఖాస్తు చేసుకున్న తర్వాత ఐటీఐలో సంప్రదించాలని వివరించారు.